క్లుప్తంగా

నేడు నీలకంఠేశ్వర ఆలయంలో జీర్ణోద్ధరణ పూజలు

గుడ్లూరు: స్థానిక పురాతన నీలకంఠేశ్వర ఆలయంలో సోమవారం జీర్ణోద్ధరణ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రామక్రిష్ణ,ఆలయ కమిటీ సభ్యులు బొమ్మిశెట్టి కాశీవిశ్వనాథం ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పుడున్న నీలకంఠేశ్వర ఆలయాన్ని తొలిగించి రూ.1.20 కోట్లతో నూతన ఆలయం నిర్మిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు గంగా పార్వతీ దేవి, గణపతిస్వామి,చండీశ్వరీ దేవి విగ్రహాలకు, ధ్వజస్తంభానికి జీర్ణోద్ధరణ చేసి వడ్లతో ధాన్యాసివాసం చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సైగా త్యాగరాజు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై త్యాగరాజు

కనిగిరి రూరల్: ఎస్సైగా తిరువీధుల త్యాగరాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వీఆర్ నుంచి బదిలీపై కనిగిరికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్సై విధులు నిర్వహించిన ఎస్సై కె.మాధవరావు కొనకనమిట్ల పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి


ఉలవపాడు గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం

ఉలవపాడు: ప్రతి విద్యార్థి చదవడం, రాయడం నేర్చుకోవాలని గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం జరిగిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆయన పలు సూచనలు చేశారు. గ్రంథాలయాల్లో విద్యార్థులు మంచి పుస్తకాలను చదవాలని తెలిపారు. విద్యార్థులతో నీతి కథలు, మహనీయుల చరిత్రలు చదివించారు. విద్యార్థులతో మళ్లీ వాటిని రాయించారు.

రక్తదానం సామాజిక బాధ్యత


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ధర్మతేజ

కందుకూరు రూరల్: 18 ఏళ్లు నిండిన యువకులంతా మూడు నెలలకొకసారి రక్తదానం చేయాలని లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నేరెళ్ల ధర్మతేజ పిలుపునిచ్చారు. భారతదేశ యువ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. చక్రి పొడపాటి తన సహచర సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో ప్రారంభించిన ఈ సంస్థ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సాయి పేర్లమిట్ట, సన్నీ, సమీర్, ప్రవీణ్‌లతో పాటు పలువురు పట్టణ యువకులు రక్తదానం చేశారు. సక్షమ్, రెడ్ క్రాస్ వారు రక్తాన్ని సేకరించారు.

తహసీల్దార్‌గా షకీర్ పాష బాధ్యతల స్వీకరణ


షకీర్‌పాష

పామూరు: తహసీల్దార్‌గా షకీర్ పాష ఆదివారం బాధ్యతలు చేపట్టారు. మంగళగిరి సీసీఎల్‌ఏ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా పామూరు తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ ఆవుల సురేష్ బదిలీపై కనిగిరి వెళ్లారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

ఒంగోలు సబర్బన్: మైనర్ బాలిక పెళ్లిని అధికారులు అడ్డుకున్న ఘటన కనిగిరిలో జరిగింది. కనిగిరి పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన 14 ఏళ్ల బాలిక 9వ తరగతి చదువుతోంది. అదే కాలనీకి చెందిన ఒక బాలుడితో ఆ బాలికకు వివాహం చేసేందుకు కొంతకాలంగా ఆమె తల్లి ప్రయత్నిస్తోంది. వివాహానికి అంగీకరించక పోవడంతో కూతురిని కొట్టడం, తిట్టడం లాంటి వేధింపులకు పాల్పడుతోంది. దీంతో సదరు బాలిక ఆదివారం కనిగిరికి చెందిన స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు డి.సుధీర్‌బాబు దృష్టికి తీసుకెళ్లింది. వెంటనే స్పందించిన ఆయన.. ఆ విషయంపై ఒంగోలు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి, కనిగిరి డీఎస్పీ రామరాజుకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశాలతో సీడీపీవో బి.సరోజిని, ఎంపీఎస్ పార్వతి రంగంలోకి దిగి బాలికను ఒంగోలులోని బాలసదన్‌కు తరలించారు. బాలిక తల్లిదండ్రులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి బాల్యవివాహం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ఆసరా'గా నిలిచాం.. ఆశీర్వదించండి



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి



డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- పేదవారికి సాయం చేసేందుకు పార్టీతో పనిలేదు
- మహిళా సాధికారతే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన మంత్రి ఆదిమూలపు సురేష్

మర్రిపూడి: రాష్ట్రంలో అన్ని వర్గాలకు ప్రభుత్వం తరఫున 'ఆసరా'గా నిలిచాం.. మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మహిళలను కోరారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, వైఎస్సార్, అంబేడ్కర్ చిత్రపటాలకు పులమాలలు వేసి నివాళులు అర్పించారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణంలో ఆదివారం నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 665 మంది మహిళా పొదుపు సంఘాల సభ్యులకు రూ.22.32 కోట్ల ఆసరా నగదును మహిళల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో 8 లక్షల మందికి రూ.25 వేల కోట్లు నాలుగు విడతల్లో రుణమాఫీ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు, జీవనోపాధి, జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు ఉన్నతి, ఆసరా, జగనన్న తోడు తదితర పథకాలను సీఎం వైఎస్ జగనన్న అమలు చేశారన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా చట్టసభల్లో మహిళలకు పెద్దపీట వేశారన్నారు. అక్కచెల్లెమ్మల కోసం ఇప్పటికి 124 సార్లు బటన్ నొక్కి రూ.2.50 లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా ఎన్నుకునేందుకు అక్కచెల్లెమ్మలందరూ ఫ్యాన్ గుర్తుపై రెండు మార్లు బటన్ నొక్కాలని కోరారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిన దార్శనీకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. పార్టీ శ్రేణులు కలిసికట్టుగా ఉండి కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులు పంపిణీ చేశారు.

గత ప్రభుత్వంలో డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేస్తానన్న మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని విమర్శించారు. టీడీపీ పాలనలో కులాల మధ్య చిచ్చుపెట్టి దళితులను అణగదొక్కారని ధ్వజమెత్తారు. తెలుగుదేశం ఓట్ల కోసం కులాల రాజకీయం చేస్తోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షులు, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, మర్రిపూడి, చిమట సొసైటీ అధ్యక్షుడు బీవీ భాస్కర్‌రెడ్డి, మాకినేని వెంకట్రావు, మండల పార్టీ అధ్యక్షుడు దొద్దాలి మల్లికార్జున, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, బోద రమణారెడ్డి, బోగసముద్రం విజయ భాస్కర్‌రెడ్డి, మాచేపల్లి నాగయ్య, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, సర్పంచ్ కే భాస్కర్, మొల్లల శివరామిరెడ్డి, ఇనుకొల్లు మాదిరెడ్డి, పీడీ వసుంధర, ఎ.వెంకటరెడ్డి, వి.మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన డ్వాక్రా మహిళలు

సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సయ్యద్ యాసిన్

కనిగిరి రూరల్: కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను ప్రధాన నరేంద్ర మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసిన్ అన్నారు. స్థానిక దరిశి చెంచయ్య భవన్‌లో ఆదివారం రామారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన యాసీన్ మాట్లాడుతూ 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి దేశ ప్రజలను మోసం చేస్తున్నాడని తీవ్రంగా ధ్వజమెత్తారు. ఈనెల 16న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. పార్టీ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, పుట్టా సుబ్బారావు, ఖాశింపీరా పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు


గాయపడిన సుదర్శి రామయ్య

జరుగుమల్లి: బైక్ ఢీకొనడంతో వృద్ధుడికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం వావిలేటిపాడు–జరుగుమల్లి మధ్య చోటుచేసుకుంది. వావిలేటిపాడుకు చెందిన సుదర్శి రామయ్య పొలాల వద్ద కాపాలగా పని చేస్తుంటారు. ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో ఇంటికి వెళ్తుండగా జరుగుమల్లికి చెందిన కంది శ్రీను బైక్‌పై వస్తూ వృద్ధుడిని ఢీకొట్టాడు. రామయ్యకు కాలు విరిగింది. శ్రీనుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులిద్దరినీ 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

ఘనంగా తిరునాళ్ల మహోత్సవం


గ్రామోత్సవ వేడుకల్లో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, నేతలు

కనిగిరి రూరల్: మండలంలోని గురువాజీపేటలో ఆదివారం సంగమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవం వైభంగా జరిగింది. తిరునాళ్ల సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్, దీప పూల అలంకరణలో సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశిష్ట పూజలు చేశారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి క్ష్మీ నారాయణరెడ్డి, మార్తాల వెంకటేశ్వర రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన గ్రామోత్సవ వేడుకల్లో పూల, పూసల బండ్లు ఏర్పాటు చేశారు.

120 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మాదాసి వెంకయ్య

టంగుటూరు: స్థానిక పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలో స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ మాదాసి వెంకయ్య ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి సమస్య రానీయొద్దు


మాట్లాడుతున్న ఎంపీపీ కోటేశ్వరమ్మ

టంగుటూరు: రానున్న వేసవి కాలంలో తాగు, సాగు నీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను వివరించారు. అనంతవరం సర్పంచి ఉప్పలపాటి శివరామరాజు మాట్లాడుతూ.. గ్రామంలో ఏఎన్ఎంలు హెల్త్ కార్డులు సక్రమంగా పంపిణీ చేయలేదని, తీర ప్రాంతంలో రొయ్యల చెరువులకు విద్యుత్ సమస్యపై సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సమావేశం దృష్టికి తెచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడుతూ మండల కేంద్రం టంగుటూరులో మాత్రమే నీటి సమస్య ఉందని, సాగర్ జలాలు కొంత వస్తున్నాయని చెప్పారు. ఏపీఓ సుభాషిణి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో రైతువారీ కుంటలు తవ్వించడం, గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ మన్నం అరుణకుమారి, వైస్ ఎంపీపీ దగ్గుమాటి సుమన్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, అన్ని శాఖల అధికారులు,ఎంపీటీసీలు,సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

బీజేపీ సమన్వయకర్తగా హరిబాబు


మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త ఘట్టమనేని హరిబాబు

కందుకూరు: భారతీయ జనతా పార్టీ కందుకూరు నియోజకవర్గ సమన్వయకర్తగా పట్టణానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు ఘట్టమనేని హరిబాబును నియమించినట్లు బిజెపి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు గాజుల వెంకయ్యనాయుడు తెలిపారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా పనిచేయాలని సూచించారు. పల్లెపోదాం కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో చేపట్టాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేసే విధంగా కృషి చేయాలన్నారు. బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు మన్నేపల్లి వరప్రసాదరావు, బ్రహ్మారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జొన్నాదుల రాఘవయ్య, ప్రధానకార్యదర్శి మురళీధర్, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథం వైకుంఠం, ఓబీసీ మోర్చా పట్టణ శాఖ అధ్యక్షుడు మాటూరి రమేష్‌నాయుడు, కార్యదర్శి ఎల్లంపల్లి శ్రీధర్, సీనియర్ నాయకులు ముప్వల భూషయ్య, నవులూరి రాజేష్, గొడ్డటి బాలరాఘవులు, తానికొండయ్య కోటయ్య, దార్ల మధుసూదనరావు, కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం


108లో ప్రసవమైన ఆడబిడ్డ, తల్లితో సిబ్బంది

పామూరు: మండలంలోని బలిజపాలెం సమీపంలో 108 వాహనంలో శనివారం రాత్రి ప్రసవం కాగా బిడ్డ, తల్లి క్షేమంగా ఉన్నారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని కోడిగుంపల గ్రామానికి చెందిన సాయిప్రియ నిండు గర్భిణి కాగా శనివారం రాత్రి పురిటినొప్పులు వచ్చాయి. ఈక్రమంలో ఆమె భర్త 108కు సమాచారం ఇచ్చారు. దీంతో దగ్గరలోని పీసీపల్లి మండలానికి చెందిన 108 వాహనం గర్భిణి ఇంటి వద్దకు చేరుకుంది. గర్భిణి సాయిప్రియను ప్రసవంకోసం వాహనంలో పామూరు వైద్యశాలకు తరలిస్తున్నారు. ఇంతలో నొప్పులు అధికంకావడంతో వాహనాన్ని పక్కన నిలిపి 108 ఈఎంటీ నాగ ప్రసాదు, పైలెట్ మాలకొండరావులు కాన్పు చేశారు. ఆమెకు పండంటి ఆడబిడ్డకు జన్మనివ్వగా తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. ఇద్దరి మెరుగైన వైద్యం నిమిత్తం పామూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

జరుగుమల్లి: మండలంలోని కామేపల్లి పోలేరమ్మ దేవాలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాస శర్మ అభిషేకాల అనంతరం పోలేరమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు పొంగళ్లు పెట్టి, జంతు బలులిచ్చి మెక్కులు చెల్లించారు. ఏర్పాట్లను ఈఓ రావెళ్ల శివశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

చిరస్మరణీయుడు బ్రహ్మానందరెడ్డి

కనిగిరి రూరల్: దివంగత మాజీ సర్పంచ్, సీపీఐ నాయకుడు ఏరువబ్రహ్మానందరెడ్డి చిరస్మరణీయుడని సీపీఐ మండల కార్యదర్శి జీ పీ రామారావు అన్నారు. స్థానిక కాశిరెడ్డి కాలనీలో ఆదివారం వై బ్రహ్మానందరెడ్డి వర్ధంతి నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ బ్రహ్మానందరెడ్డి సేవాహిత కార్యక్రమాలను కొనియాడారు. పార్టీ నాయకులు జి. బాలిరెడ్డి, పి.మోహన్, ఖాశింవలి, పవన్ కళ్యాణ సయ్యద్ ఇఫ్రాజ్, జి. సురేష్, చింతమరాము తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక బోధన


మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విభాగం డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక ప్రమాణాలతో కూడిన విద్యాబోధన అమలు చేస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విభాగం డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని సి.నాగులవరం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లు, బైజూస్ ట్యాబ్‌లు, అంతర్జాతీయ ఐబీ కరిక్యులమ్, టోఫెల్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ విద్యాబోధన జరుగుతోందన్నారు. నాడు నేడు అమలు ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు రెండు దశల్లో పూర్తిచేయడం జరిగిందన్నారు. విద్యార్థుల అవగాహనా స్థాయిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. పదో తరగతి విద్యార్థులకు కూడా బైలింగ్యువల్ పాఠ్యపుస్తకాలు సరఫరా చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ప్రమాణాల మెరుగుదల చాలా బాగున్నట్లు ఇటీవల పలు సర్వేల ద్వారా వెల్లడైందన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి ఉన్నారు.

సీఎస్‌పురం(పామూరు): ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, అంకితభావంతో పనిచేసిన వారు ప్రజా మన్ననలు పొందుతారని ఏపీ ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విభాగం డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని సి.నాగులవరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల సోషల్ ఉపాధ్యాయులు హస్తి వీరాంజనేయులు గ తనెల 31వ తేదీన ఉద్యోగ విరమణచేశారు. ఈసందర్భంగా ఆదివారం పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం మందా కుమారి అధ్యక్షతన ఉద్యోగ విరణమణ చేసి ఆంజనేయులును ఏపీ ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విభాగం డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి, పలువురు ఎంఈఓలు, యూటీఎఫ్ నాయకులు,సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తేనే వృత్తిలో రాణించడంతో పాటు గుర్తింపు ఉంటుందన్నారు. పాఠశాల అభివృద్ధికి ఆంజేయులు కృషి ఎనలేనిదన్నారు. ఎంఈఓ జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, రామిరెడ్డి, జవంగుళ వెంకట్రావు, కిరణ్, ముప్పాళ్ల వసంతకుమార్‌రాజు,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలి


విజేతలకు బహుమతులు అందచేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: విద్యార్థులు క్రమ శిక్షణతో లక్ష్య సాధన దిశగా ముందడుగు వేసినప్పుడు మంచి భవిష్యత్ ఉంటుందని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక పవిత్ర కళ్యాణ మండపంలో ఆదివారం విజేత ఐఐటీ, అండ్ నీట్ అకాడమీ కళాశాల వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉన్నత విద్యా సౌకర్యాలు కల్పించి, రాష్ట్ర స్థాయి ర్యాంకులను పొంది, కనిగిరికి గుర్తింపు తెస్తున్న విజేత కళాశాల కరస్పాండెంట్ పి. అరుణోదర్‌ను కొనియాడారు. ఇస్కాన్ కేంద్ర కమిటీ సభ్యుడు గుత్తి శ్రీధర్, వివిధ కళాశాలల కరస్పాండెంట్‌లు బాలు ప్రసాద్‌రెడ్డి, మక్కు వెంకటేశ్వరరెడ్డి, నరసింహారావు, మాలకొండయ్య, కోటిరెడ్డి, మానవతా సంస్థ చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాసులు, మదర్ సేవా సమితి అధ్యక్షుడు ఎస్ఎస్ రసూల్, పసుపులేటి వాణి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా గుడిలో చోరీ


తలుపు గొళ్లెం పగుల గొట్టిన దొంగలు


హుండీని జామాయిల్ తోటలో పడేసిన దొంగలు

ఉలవపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం పక్కన ఉన్న సాయిబాబా మందిరంలో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఆలయం తలుపు గొళ్లెం పగులగొట్టి దొంగలు గుడిలోపలికి వెళ్లి హుండీని తీసుకువచ్చి పగులగొట్టి అందులోని నగదును తీసుకుని హుండీని పక్కనే ఉన్న జామాయిల్ తోటలో పడేసి వెళ్లిపోయారు. లోపల ఉన్న మరో చిన్న హుండీ కనిపించలేదు. ఈ రెండు హుండీల్లో కలిపి సుమారు రూ.10వేల లోపు నగదు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఆలయం బయటరూమ్ లో పూజారి నివాసం ఉంటారు. ఆ రూంకు దొంగలు బయట గడిపెట్టి చోరీ చేశారు. తరువాత పూజారి బయట వెళ్లే వారిని కిటికీలో నుంచి పిలిచి తలుపు తీయించుకున్నారు. చోరీ జరిగిందన్న సమాచారం మేరకు పోలీసులు గుడి వద్దకు వెళ్లి పరిశీలించారు. కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛమైన కమ్యూనిస్టు రామకోటయ్య


మాట్లాడుతున్న అంజయ్య

కందుకూరు: కమ్యునిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన గొప్ప కమ్యూనిస్టు నాయకుడు ఓ రామకోటయ్య అని రాష్ట నాయకుడు జె.అంజయ్య అన్నారు. కమ్యూనిస్టు నాయకుడు ఓ రామకోటయ్య వర్ధంతి సభ ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రామకోటయ్య ప్రతి ఒక్కరికీ సుపరిచితుడు అని, పార్టీ నిర్మాణంలో ప్రముఖపాత్ర పోషించారని చెప్పారు. ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఆయనకిచ్చే ఘన నివాళి అన్నారు. మరో నాయకుడు డి. రామ్మూర్తి మాట్లాడుతూచివరి వరకు కమ్యునిస్టు సిద్ధాంతాలతో జీవించారని వివరించారు. సీపీఎం పార్టీ మాజీ కౌన్సిలర్ నాదెండ్ల కోటేశ్వరరావు, పాలేటి కోటేశ్వరరావు, ఏఎస్‌రావు, ఎస్‌కే మల్లిక, ఎం పద్మ, ప్రసాద్, టి. వెంకట్రావ్, ఆస్మా, గుడ్లూరు, ఉలవపాడు మండల కన్వీనర్లు జి.వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్, సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య, డాక్టర్ ముప్వా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహానివేదన, గోపూజ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన అర్చకులు మహంకాళి ప్రసాదుశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ స్వామి మూలవిగ్రహమూర్తికి పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం గోవుకు శాస్త్రోక్తంగా అర్చకులు గోపూజ నిర్వహించారు. భజంత్రీల మేళతాళాలనడుమ మహా నైవేద్యంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ జి.రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వర్‌రెడ్డి, కొమ్మినేని వెంకట్రావు, ముడుమాల నారాయణరెడ్డి, మిరియం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.